
ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022
5
విజయనగరం




29న జిల్లాలో మంత్రి జోగి రమేష్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 29న గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గృహ నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకోవడంలో భాగంగా మంగళవారం జిల్లాకు వస్తున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు గుంకలాంలో జగనన్న కాలనీని సందర్శిస్తారు. 3.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన గృహనిర్మాణశాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య ఇంజినీరింగ్, విద్యుత్తు, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో భూసమస్యలు పరిష్కారమవుతాయా? క్షేత్రస్థాయిలో ఉన్న వివాదాలు తొలగనున్నాయా? సర్వే చేపడుతున్న తీరు చూస్తుంటే స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు తీరనున్నాయా? అంటే సందేహమే!. రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి నుంచి మండల స్థాయిలో ఎంపిపి వరకు, జిల్లా కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదని పలువురు వాపోతున్నారు. రీసర్వే వల్ల రైతులకు ఒరిగేదేమీ ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు పాలకొండ మండలమే నిదర్శనం.



డ్రోన్ సర్వే చేపడుతున్న సిబ్బంది

రీ సర్వేతో.. భూ సమస్యలు తీరేనా?

- అవస్థలు పడుతున్న రైతులు
- సిబ్బందికి తప్పని తిప్పలు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భూముల రీసర్వే విస్తృతంగా సాగుతోంది. పాలకొండ మండలంలో 32 పంచాయతీల పరిధిలో 45 గ్రామాలున్నాయి. ఇందులో 34 గ్రామాల్లో రీసర్వే మొదలైంది. 22 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. మండలంలో 26,505 ఎకరాల భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే పలు గ్రామాల్లో భూ వివాదాలున్నాయి. వాటిని చెక్‌పెట్టే పరిస్థితి భూముల రీసర్వేలో కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

వివాదాల భూములకు మోక్షం లేనట్టే

మండలంలో పలు గ్రామాల్లో ఉన్న వివాదాస్పదమైన భూములకు రీసర్వేలో చెక్‌పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. భూయజమానుల మధ్య ఉన్న వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయి. పొట్లి, అవలంగి, పణుకువలస, చినమంగళాపురం తదితర గ్రామాల్లో భూసమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. వివాదాల్లో ఉన్న భూములను పెండింగ్‌లో పెడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ భూసమస్యలు పరిష్కారం కాకపోతే రీసర్వే ఎందుకని రైతుల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అనేక మంది వలసలు వెళ్లిపోయారు. వారికి గ్రామాల్లో కొంత భూమి ఉన్నప్పటికీ రీసర్వే జరుగుతున్నట్టు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వారు కూడా హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. కనీసం రెండు రోజుల ముందు గ్రామాల్లో దండోరా కూడా వేయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

సిబ్బందికి తప్పని ఇబ్బందులు

రీసర్వే లక్ష్యాలు పూర్తిచేయాలని ప్రభుత్వం క్షేత్రస్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో వారు తిప్పలు పడుతున్నారు. సర్వేయర్, రెవెన్యూశాఖలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అనేక మంది విఆర్‌ఒలు పనిభారం తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్లు సరిపడినన్ని లేకపోవడంతో ప్రయివేట్ కంప్యూటర్ కేంద్రాలకు వెళ్లి సర్వే ప్రక్రియ నమోదు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా కంప్యూటర్ల ముందుకు కూర్చుని కుస్తీలు పడుతున్నారు. కొంతమంది విఆర్‌ఒలు అనారోగ్యం పాలైనట్టు వాపోతున్నారు.

డ్రోన్ సర్వేతో మమా

మండలంలో అధికారులు డ్రోన్ కెమెరాలతో మాత్రమే 32 పంచాయతీల్లో సర్వే పూర్తి చేశారు. డ్రోన్ సర్వేతో మమా అనిపించి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి ఏ సర్వే నంబర్‌లో ఎవరు సాగు చేస్తున్నారన్న వివరాలను గుర్తించడంలో విఫలమవుతున్నారని చెప్పొచ్చు. అనేక గ్రామాల్లో కొంతమందికి డి పట్టాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఇంతవరకు నమోదు చేయలేదని తెలుస్తోంది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

తేడాలను సరిచేయడం లేదు



రీసర్వేలో భూసమస్యలు ఉన్న దగ్గర తేడాలను సరిచేయడం లేదు. సర్వే చేసినప్పుడు మా గ్రామంలో 10, 20 సెంట్లు కొంతమంది రైతుల పేరిట నమోదు కాలేదు. దీంతో ఆందోళన చెందుతున్నాం. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ సర్వే వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు.

– పనస రాంబాబు, రైతు

భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు



రీసర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. అయితే రీసర్వే ద్వారా వచ్చిన పాస్‌పుస్తకాల్లో పూర్తిగా ముఖ్యమంత్రి ఫొటోతో ముద్రించారు. దీనివల్ల భవిష్యత్తులో వేరే ప్రభుత్వం ఏర్పాటైతే మా పాస్‌పుస్తకాలు పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. పాస్‌పుస్తకాల్లో రాజముద్ర వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురవడంతో రైతుల్లో ఆందోళనగా ఉంది.

– ఖండాపు ప్రసాదరావు, రైతు

సర్వే సకాలంలో పూర్తిచేస్తాం



మండలంలో 32 పంచాయతీల్లో కూడా సర్వే సకాలంలో పూర్తిచేస్తాం. సిబ్బందితో ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో వచ్చిన డేటాను నమోదు చేయిస్తున్నాం. చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని కూడా అధిగమిస్తాం. మొబైల్ కోర్టు డిటిలను కూడా ఈ సర్వేకు నియమించాం. ఎక్కడైనా తగాదాలుంటే వారి ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– పి.సోమేశ్వరరావు, తహశీల్దార్



ర్యాలీలో పాల్గొన్న సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు

గురజాడ అభ్యుదయ దార్శనికుడు

- ఆయన భావాలను ముందుకు తీసుకెళ్లిన వారికే పురస్కారం ఇవ్వాలి
- చాగంటికి ఇవ్వడం, ఆయన తీసుకోవడం అభ్యంతరకరం
- నిరసన ర్యాలీలో సాహితీవేత్తలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయ దార్శనికుడని, ఆయన భావాలను ముందుకు తీసుకెళ్లే వారికే గురజాడ విశిష్ట పురస్కారం ఇవ్వాలని సాహితీవేత్తలు, కవులు, కళాకారులు డిమాండ్‌చేశారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ విశిష్ట పురస్కారం ప్రకటించడాన్ని నిరసిస్తూ సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు ఆదివారం నగరంలో గురజాడ గౌరవ యాత్ర పేరిట ర్యాలీ చేట్టారు. మూడులాంతర్లు కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గంటస్తంభం, ఎమ్మార్ కాలేజీ మీదుగా గురజాడ స్వగృహం వరకు ర్యాలీ సాగింది. 'దేశమును ప్రేమించుమన్నా... మంచి అన్నది పెంచుమన్నా... వట్టి మాటలు కట్టిపెట్టవోయ్ గట్టి మేల్ తలపెట్టవోయ్...' అంటూ గురజాడ దేశభక్తి గేయాన్ని ఆలపిస్తూ ముందుకు సాగారు. మార్గం మధ్యలోని గురజాడ అప్పారావు విగ్రహానికి ఒక డిసెంట్ నోట్ సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత అట్టాడ అప్పలనాయుడు, ప్రజాకవి గంట్యాడ గౌరినాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ తదితరులు మాట్లాడుతూ గురజాడ అభ్యుదయ ఒక వాది అని, ఆయన దేశం, సమాజం ముందుకు వెళ్లడానికి దోహదపడే అనేక విషయాలు వందేళ్ల క్రితమే చెప్పారని గుర్తుచేశారు. అన్నదమ్ముల వలెను జాతులు మెలగవలెనోయ్.. మతములన్నియు మాసిపోవును, జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగును.. అంటూ కులమతాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించారని వివరించారు. స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయాలను గురజాడ తన రచనల ద్వారా ఎండగట్టారని తెలిపారు. గురజాడ, చాగంటి భావాల మధ్య ఎంతో వైరం ఉందన్నారు. గురజాడకు విరుద్ధ భావాలు ప్రచారం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పురస్కారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలా ప్రశ్నిస్తున్నవారిని హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరించేందుకు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కొంతమంది ప్రయత్నించడం సరికాదన్నారు. మగవాడు స్నానం చేసేటప్పుడు కట్టుకున్న గోసిపాతను ఆడది ఉతికితే ఉన్నతమైన మోక్షం పొందుతుందంటూ చాగంటి కోటేశ్వరరావు నికృష్టమైన భావజాలం వెదజల్లారని అన్నారు. స్త్రీ జాతిని చాగంటి అణగదొక్కుతున్నారనడానికి ఇంతకన్నా ఉదాహరణలకు అక్కరలేదన్నారు. గురజాడ అభ్యుదయ భావాలను ముందుకు తీసుకెళ్లే వారికి ఈ పురస్కారం ఇవ్వాలన్నారు. ఎక్కడ అభ్యుదయం మౌనం వహిస్తుందో, అక్కడ ఛాందసవాదం, దుర్మార్గం, రుగ్మతలు రాజ్యమేలుతాయని చెప్పారు. అందువల్లే నేడు సాహితీవేత్తలంతా రోడ్డెక్కారని అన్నారు.



గురజాడ విగ్రహానికి అసమ్మతి పత్రం అందజేస్తున్న సాహితీవేత్తలు

ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి, అరసం, సహజ విశ్వసాహితి, స్నేహ కళా సాహితీ వెలుగు, రాజాం రచయితల సంఘం, ప్రజాసాహితీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు, ఒంగోలు సాహితీవేత్త నార్ని వెంకటసుబ్బయ్య, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్, మన్యాల బాలకృష్ణ చలం, ప్రజాగాయకుడు దప్పు శీను, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అనేకమంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయకులు

ఉర్రూతలూగించిన స్వరాభిషేకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహించిన స్వరాభిషేకం కార్యక్రమం ఆహూతులను ఉర్రూతలూగించింది. గురునారాయణ కళాపీఠం ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గాయనీ గాయకులు బి.ఎ.నారాయణ, బి.ఆర్.వి.ఎస్.పవన్ కుమార్ చరణ్, బివివిఎస్ సంతోష్ కిరణ్, వై.ఎల్.ఎన్.ప్రసాద్, టి.మహేశ్వరరావు, సిహెచ్ రామచంద్రశేఖర్, పి.చైతన్య, ఎస్.భాస్కర్, సాత్విక్, సంపత్, జి.ఉదయ్‌కిరణ్, సురభి శ్రావణి, హారికా శివరాం, ఎం. సత్యలక్ష్మణ్, పద్మసనీ, లీలా, స్వప్న, ఉమాదేవి, ఎం.లక్ష్మి ప్రభా, సమతాదేవి, పార్వతి.. గీతాలాపన చేసి, ఆద్యంతం అలరించారు. వాయిద్య కళాకారులు ఎం.సాయికుమార్, పవన్ కుమార్, రామారావు, మల్లేష్, చక్రపాణి, శ్రీను సహాయసహకారాలు అందించారు.

కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిఎంఆర్ అధినేత మాధురి వెంకటరమణ, ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, యార్లగడ్డ బాబురావు, ఉప్పు ప్రకాష్, ప్రముఖ టివి మూవీ ఆర్టిస్ట్ పేర్రాజు, వై.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఈడా సేవలు స్ఫూర్తిదాయకం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో మార్పు కోసం, యువతకు దిశా నిర్దేశం కోసం స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో స్పందన ఈడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచర్స్ రిలేషన్‌షిప్ ఇన్ ఎడ్యుకేటింగ్ ఫర్ నేషనల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. మహిళల రక్షణ, సాంఘిక నేరాలు అదుపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఇంటర్నెట్ చిన్నపిల్లలను, యువతను అత్యంత ప్రభావితం చేస్తోందని అన్నారు. అధునాతన సాంకేతికత సమాజ హితం కోసం ఎంత ఉపయోగపడుతుందో, అంతే దుష్ప్రభావాలు ఉన్నాయని గుర్తుచేశారు. కుటుంబ పరిధిలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ఇంటర్నెట్ వంటి సాంకేతికతను వినియోగించడంలో నియంత్రణ లేకపోవడంతో పిల్లలు, యువత పక్కదారి పట్టే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కుటుంబంలో సభ్యులందరి మధ్య స్నేహపూరిత వాతావరణం, ఆప్యాయత, అనురాగాలు ఉన్నప్పుడే సత్ప్రవర్తనతో పిల్లలు మెలుగుతారని సూచించారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రన్నర్ ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం జట్టు

బాక్సింగ్ ఛాంపియన్ విశాఖ

- రన్నర్‌గా విజయనగరం
- బెస్ట్ బాక్సర్‌గా అజయ్ వర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ఆరో సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో 13 కేటగిరీల్లో ఉత్తమ ప్రదర్శనతోపాటు అధికంగా మెడల్స్ సాధించిన విశాఖపట్నం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా విజయనగరం బాక్సర్లు నిలిచారు. జిల్లాకు చెందిన ఎన్.అజయ్ వర్మకు బెస్ట్ బాక్సర్ అవార్డు లభించింది. విజేతలకు బాక్సింగ్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథ కుమార్, అసోసియేషన్ నాయకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, జిల్లా, రాష్ట్ర నాయకులు, రిఫరీలు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో ఉన్న చిన్నారులు

కాంప్లెక్సులో చిన్నారులు

పిల్లలను వదిలివెళ్లిన బాబాయ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఇద్దరు పిల్లలను వదిలి వెళ్లిపోయిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఓ వ్యక్తి ఇద్దరు పిల్లలను తీసుకొచ్చి బస్టాండ్ వద్ద వదిలేసి, వెళ్లిపోయాడు. ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వారిని చేరదీసి, వారి నుంచి సమాచారం రాబట్టడానికి ప్రయత్నించారు. బాబాయ్‌తో వచ్చినట్లు చెబుతున్నారు తప్ప ఇంకే సమాచారం చెప్పడం లేదు. దీంతో ఇరువురిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. చిన్నారుల గురించి ఏవిధమైన సమాచారం తెలిస్తే వెంటనే వన్‌టౌన్ స్టేషన్‌ను సంప్రదించాలని సిబ్బంది కోరారు.

రోడ్డు తడపడం.. లారీలు తిరగడం వల్లే

- రహదారి ధ్వంసంపై అధికారుల వివరణ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

ప్రజాశక్తి - జామి

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవేముందు అన్న చందంగా ఉంది... భీమసింగి-ఎస్.కోట ఆర్‌అండ్‌బి రహదారి నిర్మాణ పనుల తీరు. రోడ్డు నిర్మాణం చేపట్టి మూడు దినాలు గడవకముందే, ముడతల పడి, ముడుచుకుపోయిన దుస్థితికి, పైదానికి సంబంధం ఏమిటీ అనుకుంటున్నారా? అవునండీ.. రోడ్డు కాంట్రాక్టర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధికి బంధువు కావడమే. అందుకే అధికారులు కూడా రోడ్డు కాంట్రాక్టరుకు వత్తాసు పలుకుతున్నారు. రోడ్డు ధ్వంసం కావడానికి అసలు కారణం.. గ్రీన్‌ఫీల్డ్ హైవే వాళ్ల రోజూ రోడ్డు తడుపుతున్నారని, దానిపై భారీ వాహనాలు తిరిగాయని చెప్పుకొస్తున్నారు. ఈ వాదనపై స్థానిక ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రోడ్డు నాసిరకంగా వేసిన తీరును కప్పిపుచ్చి వారి తప్పేమీ లేదని చెప్పడానికి ప్రయత్నించడం తప్ప మరొకటి కాదని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే జామి-భీమసింగి ప్రధాన రహదారి దెబ్బ తిన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

ఎస్.కోట నుంచి భీమసింగి వరకు 19 కిలోమీటర్ల రహదారి సుమారుగా రూ.5 కోట్లు పెట్టి నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. కానీ జామి, భీమసింగి జంక్షన్‌ను కలిపే 5 కిలో మీటర్ల రహదారి దాదాపుగా దెబ్బతినడం, కొత్త రోడ్డు కళ్లముందే ముడతల పడడం కాంట్రాక్టర్ వైఫల్యమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం, కాంట్రాక్టర్ తప్పేమీ లేదని, ఆ పాపం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పుణ్యమేనని నెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కారణంగా రహదాలు కొంత దెబ్బతిన్న మాటలో వాస్తవం లేకపోలేదు. ఆ కారణంగానే మొత్తం రోడ్డు ధ్వంసమైందని చెప్పడంలోనే కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైవే పనుల కారణంగా కొట్టాం, జామి, జట్టేటీవలస, లక్ష్మీపురం గ్రామాల్లో రహదారులు కొంత దెబ్బతిన్నాయి.

కానీ భీమసింగి-ఎస్.కోట రోడ్డు నిర్మాణంలో నాసిరకం పనులే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. పాత రహదారిపైన కొత్త తారు పరుపు వేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు జామి-భీమసింగి రహదారిపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.



అధ్వానంగా తయారైన రహదారి



నిరసన తెలుపుతున్న మహిళలు, ఐద్వా నాయకులు

రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం కణపాకలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై రకరకాల రూపాల్లో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మొన్న గరికిపాటి మహిళలు వేసుకునే దుస్తులపై కామెంట్లు చేశారని, ఇప్పుడు రాందేవ్‌బాబా.. ఇలా రోజుకొకరు మహిళలను హేళన చేస్తూ, హింసకు గురిచేస్తున్నారని తెలిపారు. యోగా, ప్రవచనాల ముసుగులో మహిళలను మభ్యపెట్టాలని చూసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. హింసకు వ్యతిరకంగా మహిళలు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.లక్ష్మి, కృష్ణమ్మ, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

'గురజాడను ఒకే కోణంలో చూడొద్దు'

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహాకవి గురజాడ అప్పారావును ఒకే కోణంలో చూడరాదని గురజాడ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ తెలిపారు. స్థానిక గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురజాడ గ్రంథాల్లో ఎన్నో ఆధ్యాత్మిక రచనలు ఉన్నాయన్నారు. గురజాడ అభ్యుదయ వాది మాత్రమే కాదని, ఆధ్యాత్మిక వాది కూడా అన్నారు. గురజాడ భావాలు నూటికి నూరు శాతం సరిపోయే వ్యక్తి చాగంటి కోటేశ్వరరావని, చాగంటి స్త్రీ ద్వేషి అనడంలో నిజం లేదని వ్యాఖ్యానించారు.



తరుణ్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

జాతీయస్థాయి కరాటే పోటీలకు తరుణ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ముషిడిపల్లికి చెందిన ముత్యాల తరుణ్ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. తరుణ్ ఇటీవల కొత్తవలస జిందాల్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో బంగారు పతకం సాధించాడు. ఢిల్లీలో డిసెంబర్ ఒకటో తేది నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడు. తరుణ్ మొదట కోచ్ శ్రీనివాసరావు. ప్రస్తుతం విశాఖపట్నంలో కోచ్ ప్రవీణ్ వద్ద తర్ఫీదు పొందుతున్నాడు. తరుణ్‌ను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు, తండ్రి సన్యాసిరావు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చు కోవాలి

డిప్యూటీ మేయర్ శ్రావణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి విద్యార్థీ సేవా భావాన్ని అలవర్చుకోవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోట వెనుక ప్రాంతంలోని కందకంలో పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను సంస్థ సభ్యులతో కలిసి శ్రమదానం చేసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయాలని, పార్కులను రక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మొక్కలను సంరక్షించడానికి ప్రజలు కూడా బాధ్యత వహించాలన్నారు. ప్రతి పార్కు కూడా ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు ఆడుకునేలా, పెద్దలు వాకింగ్ చేసుకునేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమేష్, డేవిడ్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడలతో విద్యార్థులు, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. గురుకుల పాఠశాలలో ఆదివారం జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని, చదువుతోపాటు క్రీడలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పీడీ ఎన్.వెంకటనాయుడు, క్రీడాకారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పాఠశాలకు అందజేసిన ఆట వస్తువు

పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు కె.సురేష్ తన తల్లి దేవుడమ్మ జ్ఞాపకార్థం ఆదివారం ఆట వస్తువులను అందజేశారు. వైస్ సర్పంచ్ కె.రమణమూర్తి చేతుల మీదుగా అందించారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడం, అందులో కార్తీకం పూర్తయి మొదటి ఆదివారం రావడంతో జిల్లా నలుమూలల నించే కాకుండా ఇతర జిల్లాల నుంచీ పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. కమాండో నెట్టు ఎక్కి చిన్నారులు ఆడుకున్నారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు ఆనంద విహార్ వద్ద డాన్సులు వేశారు. ఆల్టన్ వెహికల్ పార్కు చుట్టుముట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకులతో మెయిన్ రోడ్ లో వాహనాలు బారులు తీరాయి.

మర్రిచెట్టు తొలగింపు

ప్రజాశక్తి-పాలకొండ

రెండు నెలల క్రితం వెంకటరాయుని కోనేరు గట్టుపై నేలకొరిగిన మర్రి చెట్టును ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలోనూ, గ్రీవెన్స్‌లో అందించిన ఫిర్యాదుల మేరకు నగర పంచాయతీ అధికారులు స్పందించి చెట్టును తొలగిస్తున్నారు. దీంతో ప్రజలకు ఆటంకం తీరనుంది.

ఇసుక తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద బోగిలి పంచాయతీ పరిధిలో గల బుడ్డిపేటలో స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ తవ్వకాల వల్ల తమ గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం లేకుండాపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని కోరారు.

స్వచ్ఛతగా తీర్చిదిద్దేందుకు చర్యలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరాన్ని స్వచ్ఛతగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. నగరంలో సేకరించిన పొడి చెత్తను రీసైకిల్ చేసే నూతన ప్రక్రియను ఆదివారం ఆయన ప్రారంభించారు. స్థానిక రింగ్‌రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద రీసైకిల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఆర్ ఎన్విరో ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఈ విధానాన్ని నిర్వహించనుంది. నగరంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వర్గీకరించి, పొడి చెత్తను రీసైకిల్ చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చే నూతన విధానం అవలంబించనుంది. తడి చెత్తను గుణుపూరుపేటలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద ఎరువుగా తయారు చేస్తున్నారు. దీంతో నగరంలో సేకరించిన చెత్తంతా గుణుపూరుపేట డంపింగ్ యార్డుకు చేరకుండా ఇక్కడే కొంతవరకు రీసైకిల్ చేసేందుకు ఎన్విరో సంస్థ చర్యలు చేపట్టనుంది. ఈ విధానం వల్ల సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు, ఎన్విరో మేనేజింగ్ డైరెక్టర్ డివికె రాజు, మార్కెటింగ్ డైరెక్టర్ మోహన్ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పర్యావరణ ఇంజినీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

శ్రోతల మదిలో బాలు పదిలం

కీర్తిశేషులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం శ్రోతల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో పూల్‌బాగ్ కాలనీలో ఏర్పాటుచేసిన బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. బాలు విగ్రహ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కోలగట్ల హామీఇచ్చారు. విగ్రహ దాత సాయిబాబాను సత్కరించారు. కార్యక్రమంలో స్పార్క్ సొసైటీ కన్వీనర్ పద్మనాభం, డివిజన్ కార్పొరేటర్లు వజ్రపు సత్య గౌరీ, బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా సెంచూరియన్



వైస్ చాన్సలర్ జిఎస్ఎన్ రాజుతో ముచ్చటిస్తున్న కేర్ ప్రతినిధులు

కేర్ డైరెక్టర్ డాక్టర్ సరసు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తోందని తమిళనాడులోని మధురైకి చెందిన కళాసాలింగం అకాడమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (కేర్) డైరెక్టర్ డాక్టర్ సరసు కితాబిచ్చారు. ఆదివారం సెంచూరియన్ యూనివర్సిటీని కేర్ ప్రతినిధులు సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న వివిధ విభాగాలలో నైపుణ్య కోర్సులు, ప్రయోగశాలలను సందర్శించారు. అనంతరం పరస్పరం కలిసి పనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నూతన ఆవిష్కరణలకు అనువైన వాతావరణం ఉందని కితాబిచ్చారు. పరిశోధనలు, ప్రాజెక్టులు, మేధోహక్కులు పొందుటకు అర్హత కలిగి ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. నైపుణ్య విద్యా బోధన అత్యున్నత స్థాయిలో ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ డాక్టర్ సన్నీడియోల్, జిటిఐడిఎస్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు శంకర్, కేర్ అకాడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు, శక్తిగురు రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మైదానాల అభివృద్ధిలో కదలిక

అంచనాలు వేసిన సిబ్బంది • 'ప్రజాశక్తి' కథనానికి స్పందన


ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఎపి ఆదర్శ పాఠశాలల మైదానాల అభివృద్ధిలో కదలిక మొదలైంది. ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన 'మీ పిల్లలు కాదు కదా!' కథనానికి కలెక్టర్ సూర్యకుమారి స్పందించి, డిఇఒ లింగేశ్వర్‌రెడ్డిని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన మైదానాలను పరిశీలించి, అభివృద్ధి చేసేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు అంచనాలు తయారు చేయాలని మండల అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కొలతలు వేసి, అంచనాలను రూపొందించారు. క్రీడా మైదానాల అభివృద్ధి, సూర్యరశ్మితో వెలిగే దీపాలు, కళావేదికలు, మరుగుదొడ్లు, కిటికీలు, వాటికి మెస్‌లు, విద్యుత్తు బోర్డులు, ట్యూబ్ లైట్లు, వంటి మౌలిక సౌకర్యాలకు అంచనాలు తయారు చేసి, అందజేయనున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తెలిపారు. ఈ పరిశీలనలో గురుకులం, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్స్ ఉషారాణి, రావాడ ఈశ్వరరావు, కెజిబివి ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.



కొలతలు వేస్తున్న సిబ్బంది

రోడ్డు పనులకు శ్రీకారం



కొలతలు చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం కూడలి నుంచి ఆనందపురం రోడ్డు పనులకు ఎన్నో ఏళ్లకు మోక్షం లభించింది. రోడ్డు పనులు ప్రారంభించేందుకు అధికారులు కొలతలు వేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత రోడ్డు పనుల్లో కదలిక రావడంతో ఇప్పటికైనా ప్రయాణికుల కష్టాలు తొలగుతాయని మండల ప్రజలు భావిస్తున్నారు. కానీ, పనులు పూర్తయ్యే వరకు నమ్మకం కలగడం లేదని పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం. అందుకు కారణం లేకపోలేదు. గతంలో చాలాసార్లు కొలతలు తీయడం, పనులు ప్రారంభించేందుకు హడావుడి చేయడం, మధ్యలో ఆపేయడం ఆనవాయితీగా మారింది. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రయాణికులు పడుతున్న కష్టాలను తొలగిస్తారని పలువురు కోరుతున్నారు.

ప్రజా పాలనలో వైసిపి విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా పాలనలో వైసిపి పూర్తిగా విఫలమైందని రాజీవ్ శర్మ బృందం సభ్యులు లిఖిత్, రెడ్డి రవికుమార్ అన్నారు. కోటలో ఆదివారం 'ప్రజల పాలిట ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, భూ కబ్జాలు పెరిగిపోయాయని విమర్శించారు. వైసిపి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలని కోరారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, నాయకులు రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, పువ్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాం గ్రామంలో త్వరలోనే ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రూ..45 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆమె ఆదివారం వెల్లడించడంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.


నిలిచిన చెరువు అభివృద్ధి పనులు

పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి, డబ్బిరాజుపేట, ఆతవ, ఆకులసీతంపేట, సింగరాయి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే డబ్బిరాజు చెరువు అభివృద్ధికి నోచడం లేదు. గత ప్రభుత్వం 2019లో రూ.97.44 లక్షలను జల వనరుల శాఖ నుంచి మంజూరు చేసింది. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసిపి అధికారంలోకి మూడున్నరేళ్లు అయినా చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. మంజూరైన నిధులు ఏమయ్యాయో కూడా తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును అభివృద్ధి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచని డబ్బిరాజు చెరువు



పైడిమాంబ యాత సంక్షేమ సంఘం దాతృత్వం

ప్రజాశక్తి-బొండపల్లి, లక్కవరపుకోట

బొండపల్లి మండలంలోని అయ్యన్నఅగ్రహారం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో వికలాంగురాలు కొండిమాని గంగమ్మ ఇల్లు కాలిబూడిదైంది. ఈ విషయం తెలుసుకున్న పైడిమాంబ యాత సంక్షేమ సంఘం ఆదివారం గంగమ్మకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించింది.

లక్కవరపుకోట మండలంలోని చందులూరు గ్రామంలో నెల్లి అప్పలనాయుడు కాళ్లు విరిగి ఎన్నటికీ నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. అప్పలనాయుడును పైడిమాంబ యాత సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన కుటుంబానికి నిత్యావసర సరుకులు, కొంత నగదును అందజేశారు.

ఈ కార్యక్రమాల్లో సంఘం జిల్లా అధ్యక్షులు సిమ్మ అప్పారావు, సభ్యులు జమ్మల అప్పారావు, కొలుసు శ్రీనివాసరావు, ముంత అప్పలస్వామి, దమ్ము బంగారు నాయుడు, కుప్ప గంగరాజు, దుంగ వెంకటరమణ, కుప్ప శ్యామ్, బత్తిన ముసలనాయుడు, రాజేష్ పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు, నగదు అందిస్తున్న సంఘం సభ్యులు

సంక్షేమ పాలనతో బంగారు బాట

ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - జామి

సంక్షేమ పాలనతోనే పేదల జీవితాలకు బంగారు బాటలు పడతాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానికంగా ఉండే సమస్యలపై ఆరా తీసి వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి గొర్ల సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్ల రవికుమార్, సర్పంచ్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కెఎ పాల్.. నోరు అదుపులో పెట్టుకోండి

పర్యాటక అభివృద్ధి మండలి డైరెక్టర్ రేగాన

ప్రజాశక్తి-నెల్లిమర్ల



కెఎ పాల్ నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి రోజాపై కెఎ పాల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రపంచ దేశాలకు శాంతిదూతని చెప్పుకున్న కెఎపాల్ ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ముఖ్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్యే కొడాలి నానిపై చేసిన వ్యాఖ్యలు చాలా హేయమైనవన్నారు. వెంటనే కెఎపాల్ క్షమాపణ చెప్పి, నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం

మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-డెంకాడ



టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు కుటుంబంపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు.. వైసిపి నాయకులను హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అక్కివరంలో తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ తమ లక్ష్యమని అంటుంటే డిజిపి ఇంకా స్పందించకపోవడం దారుణమన్నారు. నారా లోకేష్‌కు కోట్లాదిమంది అభిమానులు ఉన్నారని, లోకేష్ టార్గెట్ చేస్తే తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి ఉండగలరా? అని మండిపడ్డారు. తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పర్సంటేజీ అడగడంతో జాకీ పరిశ్రమ రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని, దీన్ని ప్రశ్నించినందుకే చంద్రశేఖర్‌రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని చెప్పారు. నిజాన్ని కప్పిపుచ్చడానికి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరవాత వైసిపి నాయకులు హింసాత్మక రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారని, ఇది సబబు కాదని, అధికారం శాశ్వతం కాదని వైసిపి నాయకులు గుర్తించుకోవాలని హితవుపలికారు.

'శ్రీనివాస'లో ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - పూసపాటిరేగ



ఎడిఇ పరిపూర్ణ కుమార్‌కు మొక్క అందిస్తున్న విద్యార్థిని

మండలంలోని శ్రీనివాస పాలిటెక్నికల్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు ఉర్రూతలూగించాయి. ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి విద్యుత్తు శాఖ ఎడిఇ సత్య పరిపూర్ణ కుమార్ మాట్లాడుతూ డిప్లొమా విద్య విలువైనదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఇది ఎంతో ఉపయోగమన్నారు. గ్రామీణ ప్రాంతంలో పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేసిన శ్రీనివాస విద్యాసంస్థల అధినేత పతివాడ రమణను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ పతివాడ రమణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న వారంతా ఉన్నత విద్యావంతులు కావాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెవిఎస్ఎన్ రాజు, శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యడ్ల చిన్నంనాయుడు, శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యనారాయణ, శ్రీనివాస ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ జి.రాజశేఖర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేర్రాజుకు సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టీవీ సీరియల్ నటుడు పేర్రాజు, సామాజిక కార్యకర్త ఎస్ఎస్ఎస్ఎన్ రాజును సారిపల్లి గ్రామస్తులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పేర్రాజు మాట్లాడుతూ గృహలక్ష్మి ధారావాహికలో కుటుంబ వ్యవస్థలో తండ్రిగా తాను పోషించిన పాత్రను గుర్తించి సారిపల్లి గ్రామస్తులు సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆదరాభిమానాలు చూపుతున్న బుల్లితెర ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూనుమజ్జి వెంకట్రావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సారిపల్లి బాబూరావు, సారిపల్లి గోపాలమూర్తి, ఎస్.లక్ష్మణరావు, సీనియర్ కళాకారులు నడిపేన సూర్యనారాయణ, శారద రామకృష్ణ ఆశ్రమ అధ్యక్షులు బి.నరసింహరావు తదితరులు ఘనంగా సత్కరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండల కేంద్రంలోని ఎస్‌సి షాపింగ్ సముదాయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆయన ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడో తెలియాల్సి ఉంది. మృతదేహం వద్ద రక్తపు మరకలు ఉన్నాయి.